# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో భూముల రీ సర్వే రెండవ విడతను 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ సుమారు 17 కోట్ల రూపాయల "జల్ జీవన్ మిషన్" నిధులతో అంతర్వేదిలో నిర్మించిన సురక్షిత తాగు నీటి సరఫరా పథకాన్ని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రారంభించారు.
- ❖ టీబీ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారంతో పాటూ ఉచిత వైద్య సేవలందించేందుకు నిక్షయ్ మిత్ర యాప్ ఉపయోగపడుతోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ తెలిపారు.
- ❖ పోషణ్ పఖ్వాడా అవగాహన కార్యక్రమాలు నేటి నుండి ప్రారంభమయ్యాయి.

==========================

రాష్ట్రంలో భూముల రీ సర్వే రెండవ విడతను 2027 మార్చి నాటికి పూర్తి చేసి రైతులకు కోటీ 12 లక్షల పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 6 వేల 976 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి అయ్యిందని.. ఇంకా 16 వేల 816 గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉందన్నారు. బాపట్ల జిల్లా సూరేపల్లిలో ముఖ్యమంత్రి ఈరోజు "మీ భూమి-మీ హక్కు" కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ... తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం తీసుకువచ్చిన లాండ్ టైట్లిగ్ యాక్ట్ ను రద్దు చేసి క్యూఆర్ కోడ్ తో కూడిన 21 లక్షల 23 వేల పాస్ పుస్తకాలను పంపిణీ చేశామని చెప్పారు. జూలై నాటికి మరో 9 లక్షల పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని, మరో 80 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేయాల్సి ఉందన్నారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలతో ఈ పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

==========================

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలోని సఖినేటిపల్లి మండలంలో "జల్ జీవన్ మిషన్" ద్వారా సుమారు 17 కోట్ల రూపాయలతో అంతర్వేదిలో నిర్మించిన సురక్షిత తాగు నీటి సరఫరా పథకాన్ని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వర్చువల్ విధానంలో ఈరోజు ప్రారంభించారు. అదే విధంగా మల్కిపురం మండలం గుడిమెళ్లంకలోని 5 కోట్ల రూపాయల ఓఎన్జీస్ నిధులతో సురక్షిత తాగు నీటి ప్రాజెక్ట్ వద్ద ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ నిర్మాణానికి సైతం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం మౌలిక వసతులను మెరుగు పర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని.. అందులో భాగంగానే నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. గుడిమెళ్లంక కమ్యూనిటీ ప్రొటెక్టెడ్ వాటర్ స్కీమ్ కింద తాగునీటి సరఫరా పనులు పూర్తయితే సుమారు 30 గ్రామాలకు చెందిన లక్షా 27 వేల గృహాలకు ఇంటింటి కుళాయి కనెక్షన్ లతో సమృద్ధిగా తాగునీరు సరఫరా అందుతుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాలలో భూసమీకరణపై సంబంధిత రైతులతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ ఈరోజు సమావేశమయ్యారు. అమరావతి విస్తరణలో భాగంగా పలు ప్రాజెక్టుల కోసం ఇటీవల భూసమీకరణ ప్రక్రియను రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (CRDA) ప్రారంభించింది. దీనిపై రైతుల అనుమానాలు నివృత్తం చేసేందుకు గ్రామ సభలను ఏర్పాటు చేయగా.. స్థానిక శాసన సభ్యులు భాష్యం ప్రవీణ్ తో కలిసి మంత్రి కర్లపూడి, ఎండ్రాయి గ్రామాల్లో జరిగిన సభల్లో పాల్గొన్నారు. రెండు గ్రామాల్లో కలిపి మొత్తం 85 ఎకరాల భూమిని ఇచ్చేందుకు మంత్రి నారాయణ సమక్షంలో రైతులు అంగీకరించారు.

విరామం

==========================

మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలో 8వ పోషణ్ పఖ్వాడా కార్యక్రమం ఈరోజు ఘనంగా ప్రారంభమైంది. మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పర్యవేక్షణలో సీతంపేట ప్రాజెక్టు సీడీపీఓ బి. సిమ్మలమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతంపేట ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వరకు అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా పోషణ్ పఖ్వాడా అవగాహన పక్షోత్సవాల గోడ పత్రికను అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ కలెక్టరేట్ లోని ఆమె ఛాంబర్ లో ఈరోజు ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ ఈ పక్షోత్సవాల్లో భాగస్వాములై.. చిన్నారుల ఉజ్వల భవిష్యత్ కోసం ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా పోషణ్ పఖ్వాడా 8వ సంచిక నేటి నుండి ప్రారంభమయ్యింది. ఈ నెల 23వ తేదీ వరకు జరగనున్న ఈ అవగాహనా కార్యక్రమాలు `చిన్నారుల మొదటి ఆరు ఏళ్లలో మెదడు అభివృద్ధిని పెంపొందించడం` అనే ఇతివృత్తంతో జరగనున్నాయి. గర్భిణీలు శిశు పోషణకు సంబందించి `సుపోషిత జనని- స్వస్థ శిశు`, 'జంక్ ఫుడ్ రహిత సమాజం', `ఖేల్-సే-సీఖ్` కార్నివాల్ మొదలగు కార్యక్రమాలను ఈ 15 రోజుల పాటూ నిర్వహిస్తారు.

==========================

క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం టి.బి. ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం చేపట్టిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ తెలిపారు. విజయవాడ గొల్లపూడిలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరాన్ని ఆమె ఈరోజు సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... టీబీ ముక్త్ భారత్ అభియాన్ కోసం భారత ప్రభుత్వం ఉపయోగిస్తున్న "ని-క్షయ్" (Ni-kshay) యాప్ ను ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి 6 నెలల పాటు పూర్తి ఉచితంగా పరీక్షలు, మందులు ఇస్తామన్నారు. అలాగే ని-క్షయ్ పోషణ్ ద్వారా వ్యాధిగ్రస్తులకు నెలకి 1000

రూపాయలు పౌష్టికాహారం కోసం ఇవ్వనున్నట్లు తెలిపారు. వివిధ స్థానిక ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యంతో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో క్షయవ్యాధిపై అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పుణ్య సలీలా మాట్లాడుతూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో అనుసంధానానికి తలపెట్టిన అప్రోచ్ రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ వీఎంఆర్డీఏ అధికారులతో కలిసి ఈరోజు పరిశీలించారు. అనంతరం ఎంపీ భరత్ విలేకరులతో మాట్లాడుతూ... ఎయిర్ పోర్ట్ కనెక్టివిటీ కోసం వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, ఆర్ & బి వంటి సంస్థలు సంయుక్తంగా చేపట్టిన రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. విమానాశ్రయానికి అనుసంధానంగా ఉన్న ఏడు ప్రాధాన్య రహదారులను జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. తిమ్మాపురం నుంచి మారికవలస వరకు 6.3 కిలోమీటర్ల రహదారి పనులు దాదాపు పూర్తయ్యాయని, నేరెళవలస - కొత్తవలస రహదారి 65 శాతం పూర్తయిందని, ఏప్రిల్ నెలాఖరునాటికి పూర్తవుతుందని చెప్పారు. బోయపాలెం నుంచి కాపులుప్పాడ వరకు నాలుగు వరుసల రహదారి పనులు 66 శాతం పూర్తయ్యాయని, ఇది ఏప్రిల్ చివరికి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అదే విధంగా అడవివరం నుంచి శొంఠ్యాం వరకు నిర్మిస్తున్న ఆరు వరుసల ప్రధాన రహదారి నగరానికి కీలకంగా మారనుందని తెలిపారు.

==========================

దేశాభివృద్ధికి కీలకమైన జనగణన ప్రక్రియలో ప్రజలు తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే "సెల్ఫ్ ఎన్యుమరేషన్" స్వీయ నమోదు సదుపాయం ఈ నెల 16వ తేదీ నుంచి అందుబాటులోకి రానుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు.

==========================

==========================